సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

## క్లుప్తంగా

### మానసిక దివ్యాంగుడికి ఆర్థిక సాయం



రాజ్యలక్ష్మికి నగదు అందిస్తున్న రంథి గోపీకృష్ణ

అల్లిపురం: మానసిక దివ్యాంగుడికి వైఎస్సార్ సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ ఆర్థిక సహకారం అందించారు. జీవీఎంసీ 33వ వార్డు బంగారుమెట్ట కాలనీలో వాసుపల్లి రాజ్యలక్ష్మి మానసిక దివ్యాంగుడైన కుమారుడు ఓం సాయితో కలిసి జీవిస్తున్నారు. భర్త నుంచి విడిగా ఉంటున్న ఆమె చిన్న చిన్న పనులు చేసుకుంటూ కుమారుడిని పోషిస్తోంది. ఆమె పరిస్థితిని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ ద్వారా తెలుసుకున్న సుధాకర్, రాజ్యలక్ష్మికి బుధవారం రూ.5వేలు ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఆడారి వెంకట మహేష్, భీశెట్టి రాజు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మదీనాఖాన్, వలంటీర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల అందజేత

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డులో గర్భిణులు, బాలింతలకు బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ అందజేశారు. బాలింతల్లో రక్తహీనత, బరువు తక్కువగా ఉన్న పిల్లల వివరాలను అంగన్‌వాడీ సూపర్‌వైజర్లను కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. నాడు–నేడు పనుల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రెయ్యి డేవిడ్‌రాజు, కాసారపు వాసు, యేసు, వెంకటలక్ష్మి, శైలజ, రోజా, రమణి, వార్డు నాయకులు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

### జీవీఎంసీ జట్టు విజయం



విజయోత్సాహంలో జీవీఎంసీ క్రికెట్ జట్టు

గాజువాక: జీవీఎంసీ, ఎన్ఆర్ఐ హాస్పిటల్ జట్ల మధ్య స్థానిక జింక్ మైదానంలో బుధవారం నిర్వహించిన వీడీసీఏ ఇన్‌స్టిట్యూషన్ పూల్ సీ మ్యాచ్‌లో జీవీఎంసీ జట్టు రెండు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎన్ఆర్ఐ హాస్పిటల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు నష్టపోయి 143 పరుగులు చేసింది. లక్ష్మీప్రసాద్ 29 పరుగులు, సునీల్ 40 పరుగులు చేశారు. జీవీఎంసీ తరఫున కెప్టెన్ శివ మూడు వికెట్లు, అనిల్ మూడు వికెట్లు, రాజు రెండు వికెట్లు తీసుకున్నారు. బదులుగా జీవీఎంసీ జట్టు ఎనిమిది వికెట్లు నష్టపోయి విజయానికి అవసరమైన పరుగులు చేసింది. నరేష్ కుమార్ 24 పరుగులు, సునంద్ 33 పరుగులు, ప్రకాష్ 28 పరుగులు చేసి జీవీఎంసీ జట్టు విజయంలో కీలక పాత్ర వహించారు. ఎన్ఆర్ఐ హాస్పిటల్ జట్టు తరఫున జి.పి.నాయుడు మూడు వికెట్లు తీసుకున్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ జట్టును అడిషనల్ కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, టీమ్ మేనేజర్ సన్నీ అభినందించారు.

### కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వెంకటాద్రిపై బుధవారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
✆ 7997958342, 9912440606

# కేంద్రం మెతక వైఖరితోనే మణిపూర్‌లో హింస




జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న బ్యాంకు మహిళా ఉద్యోగులు

సీతమ్మధార(విశాఖ ఉత్తర): ప్రధాని మోదీ మణిపూర్ హింసాకాండపై స్పందించి అక్కడి ప్రజలను రక్షించాలని కోరుతూ సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదురుగా రోడ్డులో బుధవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎం.శ్రీనివాస్, ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ మే 4న మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించడం దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిందన్నారు. ఈ ఘటన జరిగి 95 రోజులు కావస్తున్నా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మౌనం పాటించిందని విమర్శించారు. ప్రపంచ స్థాయిలో మన దేశాన్ని దిగజార్చిన ఈ ఘటనపై మోదీ పార్లమెంట్‌లో స్పందించకపోవడం, మణిపూర్‌ని సందర్శించకపోవడం నిందితులకు బలాన్ని ఇస్తుందన్నారు. ప్రభుత్వ అండతో అక్కడ దుర్మార్గ శక్తులు రెచ్చిపోతున్నాయని ధ్వజమెత్తారు. మణిపూర్‌ను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.మణి, కె.సత్యవతి, బి.రత్నం, వై.తులసి, ఆర్.శోభారాణి, ఎస్.పద్మ, వి.మేరి, వై.సీతారత్నం, జి.మంగశ్రీ, సావిత్రి , వరలక్ష్మి పాల్గొన్నారు.

**మణిపూర్‌లో శాంతిభద్రతలు కాపాడాలి**

మణిపూర్‌లో మహిళలకు జరిగిన అన్యాయ్యాన్ని ఖండిస్తూ ఏపీటీబీఈఎఫ్ వుమెన్ కౌన్సిల్ ఆదేశాల మేరకు విశాఖ జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీబీఈఎఫ్ అసిస్టెంట్ కన్వీనర్ వైశాలి మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి భద్రతలు కాపాడాలన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా మహిళలపై దాడులు విపరీతంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం కార్యదర్శి ఆర్.వసంతరావు, ప్రసాద్, కమలాకర్, స్వాతి, సుజాత, ప్రత్యూష పాల్గొన్నారు.

## మహిళా కళాశాలలో నాగసాకి స్మారక దినోత్సవం




ర్యాలీలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు



గాంధీ విగ్రహం వద్ద నాగసాకి దినోత్సవాన్ని నిర్వహించిన ఇస్కఫ్, సోషల్ మీడియా క్లబ్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నాగసాకి స్మారక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడుతూ 1945లో ఆగస్టు 9న రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్‌లోని నాగసాకిపై అమెరికా అణ్వస్త్ర దాడి చేయడంతో ఆ ప్రాంతం ధ్వంసమైందన్నారు. వేలల్లో ప్రాణనష్టం జరిగిందన్నారు. ఆ విషాద ఘటనను గుర్తు చేసుకుంటూ, అణ్వస్త్రాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కలిపించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హానికరమైన రసాయనాల వాడకాన్ని నివారించే దిశగా రసాయన శాస్త్ర విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉపన్యాసం, నినాదం రాయడం, పోస్టర్ ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ బి.కల్యాణ్ రామ్, ఎం.విద్యాకల్పన, డాక్టర్ ఎ.హైమావతి, ఎస్ఎస్ఏస్ కో–ఆర్డినేటర్ ఎస్.అనురాధ, ఎన్.వి.పద్మకుమారి, డాక్టర్ కె.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార: అణుబాంబుల తయారీని ఖండించినప్పుడే ప్రపంచంలో శాంతి సాధ్యమవుతుందని ఇస్కఫ్, సోషల్ మీడియా క్లబ్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నాగసాకి దినోత్సవాన్ని గ్లోబల్ నెట్వర్క్, ఇస్కఫ్, సోషల్ మీడియా క్లబ్ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా జేవీ ప్రభాకర రాం ప్రభూ, సన్‌మూర్తి మాట్లాడుతూ అణ్వాయుధాలు వాడకం ద్వారా జరిగే పరిణామాలను అన్ని దేశాలు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సూరప్పుడు, ఉప్పల అప్పలరాజు, శ్యాంసుందర్, వై.సత్యవతి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగి మృతికి సంతాపం



శివశంకర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కొండా రమాదేవి, రాజీవ్‌గాంధీ తదితరులు

అల్లిపురం: జిల్లా గ్రంథాలయ సంస్థ రికార్డ్ అసిస్టెంట్ ఎం.శివశంకరరావు బుధవారం అనారోగ్యంతో మరణించారు. ప్రస్తుతం ఈయన అల్లిపురం శాఖా గ్రంథాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. అతని మరణ వార్త తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ సంతాపం తెలిపారు. శివశంకర్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన కుమారుడికి కారుణ్య నియామకాల్లో ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంత్యక్రియల నిమిత్తం రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. అల్లిపురం శాఖా గ్రంథాలయ అధికారి పీవీ సూకరాజు, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొని అంజలి ఘటించారు.

## నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



పోస్టర్ విడుదల చేస్తున్న డిఎంహెచ్ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు

మహారాణిపేట: పిల్లల్లో ఎన్నో వ్యాధులకు కారణమైన నులి పురుగుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినంగా పాటిస్తున్నట్టు, పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రాలు ఉచితంగా పంపిణీ చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 1900 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 62 కాలేజీలు, 742 అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం 4,75,358 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి గురువారం ఉచితంగా మాత్రలు పంపిణీ చేయనున్నామన్నారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాలన్నారు. 3 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు పూర్తి మాత్ర ఇచ్చి చప్పరించాలని సూచించారు. మధ్యాహ్నం భోజనం చేసిన అరగంట తర్వాత మాత్ర ఇవ్వాలన్నారు. మాత్రల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గురువారం మాత్రలు వినియోగించలేని వారి కోసం తిరిగి ఈనెల 17న మాప్ అప్ రౌండ్ కింద అవసరమైన వారికి మాత్రలు అందిస్తామన్నారు. 5,20,000కు పైగా మాత్రలు సిద్ధం చేశామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి డి.రమారెడ్డి, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సమత, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా స్ఫూర్తితో మోదీని ఓడిద్దాం




మాట్లాడుతున్న నర్సింగరావు

సీతమ్మధార: క్విట్ ఇండియా స్ఫూర్తితో మోదీని ఓడిద్దామని, దేశాన్ని, ప్రభుత్వ రంగాన్ని రక్షించుకుందామని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. క్విట్ మోదీ..సేవ్ ఇండియా అంటూ నినదించారు. అఖిలపక్ష సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం నిర్వహించిన దీక్షలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ తన ఆప్తమిత్రులైన అంబానీ, ఆదానీలకు కట్టబెడుతున్నారన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ వారికి కట్టబెట్టాలని ఎన్ని కుట్రలు చేసినా విశాఖ కార్మికవర్గం 900 రోజులుగా పోరాడుతూ ప్రైవేటీకరణను నిలువరించిందన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరారు. ఐక్యపోరాటాలతో మోదీని ఓడించడానికి కార్మికవర్గం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో స్టీల్ ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ మంత్రి రాజశేఖర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కనకారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాస్, ఆర్.కె.ఎస్.వి.కుమార్, పి.మణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఏయూలో ఉద్యోగ మేళా

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో, మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు డిప్యూటీ చీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్ ఇండియా సంస్థలో ఫార్మాసిస్ట్, ఫార్మసీ ఎయిడ్, సీఎస్, డెలివరీ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 90 ఖాళీలను భర్తీ చేస్తామని, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ కోర్సులను పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునన్నారు. నెలకు రూ.11,080 నుంచి రూ.16 వేలు మధ్య వేతనం చెల్లిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు ncs. gov. in వెబ్‌సైట్ నుంచి వివరాలు నమోదు చేసుకుని గురువారం ఉదయం 10.30 గంటలకు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

## నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో పూజా రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్ర నామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

## మైనర్ బాలలకు పరామర్శ

మహారాణిపేట: ముడసర్లోవ ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో మైనర్ బాలల కొట్లాటలో గాయపడి, కేజీహెచ్ క్యాజువాల్టీ వార్డులో చికిత్స పొందుతున్న 5గురు మైనర్ బాలలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం బుధవారం పరామర్శించారు. బాలల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులనడిగి వివరాలు తెలుసుకున్నారు. త్వరితగతిన మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. బాధిత బాలలు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. భవిష్యత్తులో ఇటువంటి తగాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని హోమ్ నిర్వాహకులకు సూచించారు. హోమ్‌లో జరిగిన ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక సమర్పించాలని జిల్లా ఉన్నతాధికారులకు సూచించారు. నివేదిక ఆధారంగా సంబంధిత అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేయనున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఆస్పత్రి వైద్యాధికారులు, బాలల సంరక్షణ విభాగం సిబ్బంది, వన్ స్టాప్ సెంటర్ శరణ్య, లవకుశ తదితరులు పాల్గొన్నారు.

## అంకుర సంస్థలకు ఆ హబ్ సాయం

ఏయూ క్యాంపస్: యువత స్థాపించి, నిర్వహిస్తున్న అంకుర సంస్థల(స్టార్టప్)కు ఆర్థిక సహకారాన్ని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు ఏయూ ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు ఒక ప్రకటనలో తెలిపారు. భారత శాస్త్ర సాంకేతిక విభాగం ఏర్పాటు చేసిన నిధి పథకంలో భాగంగా యువత ఆలోచనలు, ఆవిష్కరణలుగా, ఉత్పత్తులుగా మార్చడానికి అవసరమైన మూలధనం అందిస్తామన్నారు. కనిష్టంగా రూ.2లక్షలు, గరిష్టంగా రూ.10 లక్షల వరకు అందిస్తామని పేర్కొన్నారు. టెక్నాలజీ, సైన్స్ ఆధారంగా పనిచేసే అంకుర సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సాంకేతిక ఆధారిత ఆవిష్కరణలకు ఫొటో టైప్ ఉత్పత్తిని 12 నెలలో తీసుకురావాల్సి ఉందన్నారు.వివరాలకుఏయూ ఆ హబ్‌లో నెలకొల్పిన ఏయూ నిధి ఐటీబీఐ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పంచాయతీ కార్యదర్శి మృతి

గోపాలపట్నం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన గంట కృష్ణ(47) నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విమాన్‌నగర్‌లో నివాసముంటున్న గంటా కృష్ణ చోడవరం మండలం జన్నవరంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి విధులు పూర్తి చేసుకుని ఇంటికి బయలుదేరారు. ఎన్ఏడీ జంక్షన్‌లో బస్సు దిగి ఆటోలో విమాన్ నగర్ బస్‌స్టాప్ వద్దకు చేరుకున్నాడు. రోడ్డు దాటుతుండగా ఎన్ఏడీ నుంచి వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టడంతో తలకు, శరీరంపై పలు చోట్ల గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నగరంలో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. బుధవారం కృష్ణ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

## వైభవంగా సాంస్కృతిక కార్యక్రమాలు

ఎంవీపీ కాలనీ: శ్రీవేంకటేశ్వరస్వామి శ్రావణ సంగీతోత్సవాల్లో భాగంగా బుధవారం సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా ఈ వేడుకలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. నాద ప్రియతే నమో నమః పేరిట నిర్వహించిన భక్తి గీతాలతో కూడిన కూచిపూడి నృత్య ప్రదర్శనలతో విద్యార్థినులు అలరించారు. సిరి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రోజు పాఠశాలలకు చెందిన విద్యారులు ఈ ఉత్సవాల్లో నాట్యం, సంగీతం, ఇతిహాసాలు, పురాణగాథలపై ప్రదర్శనలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 16వ తేదీ వరకు సాయంత్రం 4.30 గంటల నుంచి 8.30 గంటల వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 12, 13వ తేదీల్లో డ్రాయింగ్, కీర్తనలు, కథల పోటీలు ఉంటాయని తెలిపారు. 15న విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. ప్రతి రోజు రాత్రి 8.30 గంటలకు హారతి, ప్రసాద వితరణ జరుగుతుందని వెల్లడించారు.

# 'అర్హులందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలి'

జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్



వెలంపేట ఏరియాలో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ సూచించారు. దక్షిణ నియోజకవర్గంలోని వెలంపేట పరిధిలో 91, 98 పోలింగ్ బూత్‌ల పరిధిలో నిర్వహించిన ఇంటింటికీ ఓటరు సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బీఎల్‌వోలు డోర్ టు డోర్ వెరిఫికేషన్‌కు వచ్చినప్పుడు ఓటరు వివరాలు, డోర్ నెంబరు సరిగ్గా ఉన్నది, లేనిదీ పరిశీలించుకోవాలన్నారు. పాత ఓటర్ల వివరాలు, కొత్తగా చేరిన వారి నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటు అనేది భారత రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు అని, కుటుంబంలో 18 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, మహారాణిపేట తహసీల్దార్ టి.ఆనంద్ కుమార్, బూత్ లెవెల్ అధికారులతో పాటు బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- టీహెచ్ఆర్ కిట్ల పంపిణీకి శతశాతం రిజిస్ట్రేషన్ చేయాలి
- ఐసీడీఎస్ అధికారుల సమీక్షలో జేసీ విశ్వనాథన్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్,చిత్రంలో ఐసీడీఎస్ అధికారులు

మహారాణిపేట: గర్భిణులు, బాలింతలను ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకము (టేక్ హోమ్ రేషన్ – టీహెచ్ఆర్)కు శతశాతం రిజిస్టర్ చేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన ఐసీడీఎస్ డిపార్ట్‌మెంట్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు,బాలింతలకు ఇచ్చే సరకులు, టేక్ హోం రేషన్ కిట్ల పంపిణీలో ఆటంకాలు లేకుండా ప్రతీనెల సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.

**'ఫ్యామిలీ ఫిజీషియన్' ద్వారా వైద్యసేవలు**

బాలింతల్లో రక్తహీనత ఉన్నవారి వివరాలు, బరువు తక్కువగా ఉన్న పిల్లల వివరాలు అంగన్‌వాడీ సూపర్ వైజర్లను అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా గర్భిణులు, బాలింతలు, బరువు తక్కువ ఉన్న పిల్లల వద్దకు ప్రతీ వారం డాక్టర్‌ను పంపించి, ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మళ్లీ వచ్చే సమావేశం నాటికి పూర్తి వివరాలు తీసుకురావాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్లను ఆదేశించారు. నాడు–నేడు పనుల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ డి.వెంకటేశ్వరి, సీడీపీవోలు ఎం.వి.రమణ కుమారి, డి.నీలమణి, ఎం.శ్రీదేవి, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం



రామకృష్ణ కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



సోరియాసిస్ వ్యాధితో బాధపడుతున్న లక్ష్మికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు దిగువ రెల్లి వీధి శబరినగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మంగళగిరి రామకృష్ణ మంగళవారం రాత్రి జగదాంబ జంక్షన్ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం రామకృష్ణ కుటుంబ సభ్యులకు దహన సంస్కరణల కోసం రూ.10వేలు అందజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే పోలీస్ అధికారులతో మాట్లాడి సీసీ కెమెరాలు తనిఖీ చేసి ప్రమాదం ఎలా జరిగిందో వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి రామకృష్ణ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని సూచించారు.

- 32వ వార్డు చలువతోట ప్రాంతానికి చెందిన బాలంకి లక్ష్మి చర్మవ్యాధితో బాధపడుతున్నట్టు తెలుసుకుని ఆమె ఇంటికి వెళ్లి రూ.5వేలు సొంత నిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి నీలకంఠం, ప్రసాదరావు, బోని దేవా, బాబుల్ శ్రీను, బొడ్డేటి ప్రసాద్, లండా రమణ, బొగ్గు శ్యామ్, ఆదివిష్ణు, కిషోర్, చెన్నా శ్రీధర్, పూడి మధు, సుధాకర్, మీసాల అశోక్‌కుమార్, లక్ష్మీపతి, కృష్ణవేణి, దేవుడు, లక్ష్మీ, కోటి, గోవింద్, రమేష్, భానుమూర్తి, నీరజ్ పాల్గొన్నారు.

# విస్తృతంగా సేవా కార్యక్రమాలు



కేజీహెచ్ పిల్లల వార్డులో చిన్నారులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేస్తున్న అభిమానులు



మహేష్‌బాబు జన్మదిన వేడుకలలో పాల్గొన్న కోలా గురువులు, జియ్యాని శ్రీధర్ తదితరులు

దాబాగార్డెన్స్: సినీనటుడు మహేష్‌బాబు జన్మదినం సందర్భంగా బుధవారం నగరంలోని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖ సిటీ వైడ్ కృష్ణ అండ్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్(సరస్వతి పార్క్) ఆధ్వర్యంలో కేజీహెచ్ పిల్లల వార్డులో కేక్ కట్ చేసిన అనంతరం చిన్నారులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ సమీప అమెరికన్ ఆస్పత్రి ఓల్డేజ్ హోమ్‌లో వృద్ధులకు పండ్లు, పాలు, రొట్టెలు అందజేశారు. అలాగే జగదాంబ జంక్షన్ సమీప రోటరీ బ్లడ్ బ్యాంక్‌లో మహేష్‌బాబు అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, బీసీహెచ్ అప్పారావు, గాజుల వెంకట్రావు, చిన్న, కాశీ, ఎస్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురం: విశాఖ సిటీ వైడ్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి భీమ్‌నగర్‌లోని వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొని వృద్ధులకు అన్నసమారాధన చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, కార్యదర్శి మురళీకృష్ణ, పలువురు అభిమానులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా 'మన మట్టి- మన దేశం' ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం జోన్–5 కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన 'మన మట్టి, మన దేశం, నేల తల్లికి నివాళులు, స్వాతంత్ర్య సమరయోధులకు వందనం 'కార్యక్రమాన్ని కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ ప్రారంభించారు. ముందుగా జోన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె చేపట్టారు. అనంతరం మన నేల- మన దేశం ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, యూసీడీ ఏపీడీ చిరంజీవి, సీవో సత్యవతి, వేళంగిణిరావు, కమల్, దేవి, అన్నపూర్ణ, ఈశ్వరి, రాయప్ప, శ్యామ్ సుందర్, పిల్లి గోవింద్, ఆనంద్, సచివాలయ కార్యదర్శులు, నాయుడు, అశోక్, ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
✆ 7075989701
Office mail : sakshiadvtvsp@gmail.com